క్లుప్తంగా

కిటకిటలాడిన శృంగార వల్లభుని ఆలయం


స్వామి సన్నిధిలో భక్తజనం


తిరుపతి శృంగార వల్లభస్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయం భూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయంలో టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన శాల ద్వారా రూ.3,61,480 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. నూతన దంపతులు, దాతలను ఆలయ అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు


బెల్లపు ఊటను పరిశీలిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

పెద్దాపురం: స్థానిక ఎస్‌ఈబీ ఇన్‌చార్జి సీఐ స్వామి ఆధ్వర్యంలో శనివారం గండేపల్లి మండలంలో దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఈబీ ఎస్సై వై.నాగేంద్రకృష్ణ తెలిపారు. అక్కడి ఎస్టీ రాజాపురం, మురారి గ్రామాల్లో దాడులు నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకుని పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది సునీల్‌కుమార్, వెంకటేశ్వరరావు, గిరిధర్, అప్పారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువపై వివాదాస్పద షట్టర్ల తొలగింపు

పిఠాపురం: మండలంలోని గోకివాడ పుట్ట కొండయ్య పంట కాలువపై అక్రమంగా నిర్మించిన షట్టర్లను అధికారులు శనివారం తొలగించారు. గత కొన్ని రోజులుగా గోకివాడ, ఇతర గ్రామాల రైతులకు మధ్య ఈ షట్టర్ల విషయంపై తీవ్ర వివాదం జరుగుతోంది. కాగా గోకివాడ పుట్ట కొండయ్య కాలువపై అనుమతి లేకుండా ఇనుప షట్టర్లు నిర్మించడంతో కాలువ కింద రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు శనివారం వాటిని తొలగించారు. షట్టర్లను తొగించరాదంటూ స్థానిక ప్రజాప్రతినిధులతో సహా రైతులు ఆందోళనకు దిగడంతో పోలీసు బందోబస్తు మధ్య అధికారులు షట్టర్లను తొలగించారు. ముందు జాగ్రత్త చర్యగా కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మది నిండా మహానేత

- ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి
- గ్రామాల్లో జోరుగా సేవా కార్యక్రమాలు


పిఠాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


పెద్దాపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు, పార్టీ శ్రేణులు

పిఠాపురం: తనదైన ముద్రతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందిన ఏకైక మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో శనివారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పిఠాపురం పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే దొరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, నేతలు బొజ్జా రామయ్య, గండేపల్లి బాబీ, కొత్తపల్లి బుజ్జి, వజ్రపు వీరేష్, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు మండలంలో..

గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగ లోవరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ దొండపాటి లోవతల్లి, ఉప సర్పంచ్ కుమారి, చక్రధరుడు, ఉలవకాయల బాబ్జి, ఎంపీటీసీ తుమ్మలపల్లి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు. ఏకే మల్లవరంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

సామర్లకోటలో..

సామర్లకోట: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రాజీవ్ గృహకల్ప వద్ద వైఎస్సార్ విగ్రహాలకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి, డాక్టర్ వైఎస్సార్ యువసేన జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. స్థానిక సిరి మానసిక దివ్యాంగుల కేంద్రంలో కేక్ కట్ చేశారు. మానసిక దివ్యాంగులు, సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను తదితరులు పాల్గొన్నారు. మాధవపట్నంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, పి.వేమవరంలో నాయకుడు ఎలిశెట్టి నరేష్, ముసిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాల్లో వేడుకలు నిర్వహించారు. చంద్రపాలెంలో పండపాక దొరబాబు, వేట్లపాలెంలో పాలచర్ల సాయిబాబు, జి.మేడపాడులో మోరంపూడి రంగనాయకులు, మోరంపూడి రమేష్, పీబీ దేవంలో మలకల సూరిబాబు, ఉండూరులో సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, నవరలో మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వీకే రాయపురంలో జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, పవరలో వీరంరెడ్డి ఆనంద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.


వాకతిప్పలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండల వ్యాపంగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వాకతిప్పలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, సర్పంచులు పాలాని దొరబాబు, నక్క మణికంఠ బాబు, గవర భవాని తదితరులు పాల్గొన్నారు. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగులాపల్లిలో వైఎస్సార్ కాంస్య విగ్రహానికి మాజీ ఎంపీపీ అబ్బిరెడ్డి బావనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


పి.వేమవరంలో వైఎస్సార్‌కు నివాళి


కాండ్రకోటలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో..


గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సమాజం గర్వించదగ్గ నేత వైఎస్సార్

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ తదితరులు పూలమాలలు వేశారు. దొరబాబు మాట్లాడుతూ సమాజం గర్వించదగ్గ మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, పార్టీ బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పుట్టా వెంకట్రావు పాల్గొన్నారు. కాండ్రకోటలో వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ సూరిబాబు, గంటా రామస్వామి పూలమాలలు వేశారు. తాటిపర్తిలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గోపు మురళి, వడ్లమూరులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, దివిలిలో నరాలశెట్టి త్రినాథ్, చంద్రమాంపల్లిలో కురిమెళ్ల లోవరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, గోరింటలో బర్రే రామగోవిందు, అలాగే వివిధ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. స్థానిక పాత పెద్దాపురం ఒకటో వార్డులో కౌన్సిలర్ వీర్రాఘవులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

అమ్మా మనసారె దీవించు


అమ్మవారికి సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు దంపతులు, భక్తులు

- పురుహూతిక అమ్మవారికి ఆషాఢమాస సారె సమర్పణ
- భారీగా తరలివచ్చిన భక్తులు

పిఠాపురం: స్థానిక పురుహూతిక అమ్మవారికి ఆషాఢ మాస సారెను శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు దంపతులు సమర్పించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల మేరకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వందలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ మేళతాళాలు, బాజాభజంత్రీలు, కోలాట ప్రదర్శన తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఎమ్మెల్యే దంపతులు, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు తమ శిరస్సుపై అమ్మవారి సారెను ధరించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురుహూతిక అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన సంస్కృతీ సంప్రదాయాల్లో సారెకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అలాంటి సారెను శక్తి పీఠాల్లో ఒకటైన పురుహూతిక అమ్మవారికి సమర్పించడం తన పూర్వజన్మ సుకృతమని ఎమ్మెల్యే దొరబాబు అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, కుంతీమాధవస్వామి, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం ఆలయాల ట్రస్టుబోర్డు చైర్మన్లు వరదా శేషు, రెడ్డెం జనార్దనరావు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు శాకంబరిగా నూకాలమ్మ

సామర్లకోట: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక స్టేషన్ సెంటర్‌లో వేంచేసి ఉన్న నూకాలమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించనున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంచారామ క్షేత్ర దీపారాధన సంఘ సభ్యులచే అలంకరణ చేస్తామన్నారు. ఉదయం నుంచి అమ్మవారి అలంకరణను తిలకించడానికి భక్తులకు అవకాశం ఉంటుందన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తామని చెప్పారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏడు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి శనివారం తెలిపారు. పిఠాపురం రూరల్‌లో 3, గొల్లప్రోలు మండలంలో 2, కొత్తపల్లి మండలంలో 2 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వివరించారు. పిఠాపురం మండలం రాపర్తి సచివాలయం-4 పరిధిలో ఒక అంగన్‌వాడీ హెల్పర్ పోస్టు ఉండగా బీసీ-ఎ కి, బి.ప్రత్తిపాడు 2లో ఓసీ కి, కోలంక 2లో ఎస్సీకి కేటాయించామన్నారు. కొత్తపల్లి మండలం కుతుకుడుమిల్లిలో బీసీ-బికి, పొన్నాడ శివారు రామరాఘవపురంలో ఓసీకి కేటాయించగా, గొల్లప్రోలు రూరల్ చేబ్రోలు బీసీ-డికి, ఏకే మల్లవరం-2లో ఓసీ అభ్యర్థులకు కేటాయించారన్నారు. ఈ పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండి పదో తరగతి పాసై ఉండాలన్నారు. స్థానికతకు సంబంధించి స్థానిక తహసీల్దార్ నుంచి నివాస ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. సోమవారం నుంచి పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 17వ తేదీ లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పోస్టుల భర్తీకి చర్యలు

పెద్దాపురం: స్థానిక ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఉష తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ పోస్టులకు సంబంధించి 17వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పెద్దాపురం మండలం కాండ్రకోట (ఎస్సీ), పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో (ఎస్సీ) ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 35 ఏళ్ల లోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని కొత్త మూలపేటకు చెంది కొనాల లోవరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. కాగా లోవరాజును శనివారం పిఠాపురం విష్ణు హాస్పటల్ అధినేత పిల్లా శ్రీధర్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొనాల సూరిబాబు, నిమ్మ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ముంపు సమస్య తీర్చండి

సామర్లకోట: వీకే రాయపురంలో పంట పొలాలకు ముంపు సమస్య తీర్చాలని రైతులు కోరారు. ఈ మేరకు వారు శనివారం వ్యవసాయ అధికారులను కలసి వివరించారు. ఏలేరు కాలువ అవతలి వైపు ఉన్న పంట భూములు తరచూ నీటి ముంపునకు గురవుతున్నాయని, ఇటీవల వర్షాలకు చెరువులుగా మారాయని రైతు సంఘ నాయకులు వెలమర్తి శ్రీనివాసు, ఇంటి రమేష్, వెలమర్తి బులిరాజు, బదిరెడ్డి ప్రకాశరావు, ఓదూరి నాగేష్‌లు శనివారం కాకినాడ వెళ్లి జేడీ ఎస్.విజయకుమార్, ఏడీఏ జీవీ పద్మశ్రీ, ఏఓ ఐ.సత్యలకు తెలిపారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్‌కు తెలిపి పరిష్కరిస్తామని వారు అన్నారు.

లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించండి

కాకినాడ లీగల్: లోక్ అదాలత్ ద్వారా అధిక కేసులు పరిష్కరించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. శనివారం కాకినాడ కోర్టులో బార్ అసోసియేషన్‌ను ఆమె సందర్శించారు. కాకినాడకు కొత్తగా ఎస్సీ, ఎస్టీ కోర్టు, కమర్షియల్ కోర్టులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాదులు విన్నవించగా పరి శీలిస్తామని న్యాయమూర్తి చెప్పారు. కోర్టు ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కాకినాడ మూడో అదనపు జిల్లా కోర్టు భవన సముదాయం, సబ్ కోర్టు, మున్సిబ్ కోర్టులను జిల్లా న్యాయమూర్తులు పి.కమలాదేవి, హరినారాయణ, నిఖిత, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, స్టేట్ బార్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ తదితరులతో కలసి పరిశీలించారు. ఈ కోర్టు భవనాలను వీలైంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తింటి విశ్వేశ్వరరావు, చెక్కా శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీరభద్రరావు, జాయింట్ సెక్రటరీ శంకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం ముందుగా ఏకపాత్రాభినయం పోటీలు జరిగాయి. శాస్త్రి కళాపీఠం వ్యవస్థాపకుడు సీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రికి ఆంధ్రశ్రీ అవార్డు, ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ కార్యదర్శి ఓబీఎస్ ప్రసాద్‌కు ఆత్మీయ రంగస్థల పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) సమర్పణలో శ్రీమంజునాథ్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'థింక్' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. మంచి ఆలోచనతో సమాజాన్ని ఏవిధంగా పురోగతి వైపు నడిపించవచ్చో వివరించారు. అనంతరం చైతన్యభారతి సంస్థ (కరీంనగర్) సమర్పణలో మంచాల రమేష్ దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఖరీదైన జైళ్లు' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఖైదీలలో పరివర్తన తీసుకు రావాల్సిన జైళ్లు ఏవిధంగా పక్షపాత వైఖరితో పనిచేస్తున్నాయో కళ్లకు కట్టినట్లు వివరించారు. అనంతరం శ్రీకృష్ణా తెలుగు థియేటర్స్ (గుడివాడ) సమర్పణలో శీరం శ్రీనివాసరావు దర్శకత్వంలో ప్రదర్శించిన పారిజాతం నాటిక అలరించింది. పరిషత్ గౌరవ అధ్యక్షులు కర్రి భామిరెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి దయానందబాబు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి


రైల్వే ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: రైల్వే సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్‌లో వివిధ శాఖల సిబ్బందికి నిర్వహించిన భద్రతా సదస్సులో ఆయన మాట్లాడారు. విజయవాడ డివిజన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల భద్రతకు సంబంధించి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, స్టేషన్ సూపరింటెండెంట్లు శ్రీధర్, అనంతలక్ష్మి, స్టేషన్ మాస్టర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాముకాటు

సామర్లకోట: పవర గ్రామ పంచాయతీ మేజర్ కాలువలో పూడికతీత పనులు చేస్తుండగా ఉపాధి కూలి ఆలపాటి మేరీకుమారి పాముకాటుకు గురైంది. ఈ విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు తదితరులు స్థానిక ట్రినిటీ ఆస్పత్రికి ఆమెను తరలించారు. డాక్టర్లు వెంటనే స్పందించి వైద్య సేవలు అందించడంతో మేరీకుమారి కోలుకుంటుందని ఉపాధి హామీ పథకం ఏపీఓ ప్రభాకరరావు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ డి.శ్రీలలిత ఆస్పత్రికి చేరుకుని బాధితురాలి పరిస్థితిని తెలుసుకున్నారు.

శెట్టిబత్తుల కుటుంబానికి పరామర్శ

సామర్లకోట: పట్టణ వైఎస్సార్ సీపీ కోశాధికారి శెట్టిబత్తుల దుర్గారావు సోదరుడు శెట్టిబత్తుల దొరబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, అచ్చంపేట మాజీ సర్పంచ్ సలాది రమేష్ తదితరులు ఉన్నారు.